Crime Mirror
QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
23-9-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:13
సంచిక: 323

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త!

కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

జాగ్రత్తగా పనిచేస్తే రెండోసారి కూడా అధికారం మనదే..

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి చేర్చే బాధ్యత తీసుకోవాలి

గత 9 నెలల్లో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశా..


కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేస్తే కచ్చితంగా అవకాశాలు లభిస్తాయని వ్యాఖ్య

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేలకు వివరించిన ముఖ్యమంత్రి



హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జాగ్రత్తగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు ఇవ్వొద్దని, ముఖ్యంగా అధికారుల పోస్టింగ్‌ల విషయంలో జోక్యం చేసుకోకుండా ఉంటే మంచిదని స్పష్టం చేసినట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడటం, పోస్టింగుల విషయంలో జోక్యం చేసుకోవడం వల్లే ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించినట్టు సమాచారం. అందువల్ల ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా పనిచేసుకుంటే.. రెండోసారి కూడా అధికారంలోకి వస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకారం నేపథ్యంలో.. ఆయనకు అభినందనలు తెలిపేందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సీఎల్పీ సమావేశమైంది. ఈ కార్యక్రమంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సన్మానించారు. మహేశ్‌గౌడ్ నియామకంపై పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీలో సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు తీసుకెళ్లే బాధ్యతలను పార్టీ నేతలు తీసుకోవాలని కోరారు. "పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం. లోక్‌సభ సీట్లు గెలిచాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారికి పదవులు ఇచ్చాం. కష్టపడి పనిచేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో కచ్చితంగా అవకాశాలు వస్తాయి. నిబద్ధత కలిగిన నాయకుడు కాబట్టే మహేశ్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి వచ్చింది. బీసీల కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన. ఆయన ఆలోచన మేరకు రాష్ట్రంలో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను

(మిగతా 2వ పేజీలో)



## నిలబడతాం.. బలపడతాం

మా కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు

అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం

శాంతియుతంగా సమస్యల పరిష్కారం

భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు..

సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యాలు

క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

2లో



'అమృత్'లో అక్రమాలు తేలకపోతే

## రాజకీయ సన్యాసం

మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్

అమృత్ పథకం టెండర్లలో స్కాం నిజమే

సీవీసీ లేదంటే హైకోర్టు సీజే దగ్గరికి వెళ్దాం

ఫైళ్లు ముందుపెట్టి విచారణను కోరుదాం

కాంగ్రెస్‌పై మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

## చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా?



పెదకాకాని, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. లడ్డూకు వినియోగించిన నెయ్యిలో పశువుల కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె, సోయా, సన్ ఫ్లవర్ లాంటి ఇతర నూనెలు ఉన్నట్లు ఎన్‌డీడీబీ సీఏఎల్‌ఎఫ్ ల్యాబ్ నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. వైసీపీ హయాంలో ఇలాంటి నేతిని వినియోగించిన లక్ష లడ్డూలను అయోధ్య రామ జన్మభూమి మందిరానికి టీటీడీ పంపి చాలా పెద్ద తప్పు చేసిందని అన్నారు. హిందువులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడం నీచమైన చర్య అని దుయ్యబట్టారు. ప్రతి హిందువూ, ధర్మాన్ని పాటించే ప్రతి వ్యక్తి దీన్ని ఖండించి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి లడ్డూ



## లడ్డూ అపచారంపై సిట్ దర్యాప్తు

లడ్డూ అపచారంపై సిట్ దర్యాప్తు..

ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో బృందం: సీఎం

వైసీపీ రాగానే ఇష్టానుసారం సభ్యుల నియామకం

టీటీడీలో 50 మందిని నియమిస్తే కోర్టుకెళ్లాల్సి వచ్చింది

కనిపించినవారందరినీ ఎక్స్-అఫిషియో చేశారు

అడ్డగోలుగా దర్శనం టికెట్లు అమ్మారు

దీనికి నిరసనగా నేను, పవన్ నాడు ధర్నా చేశాం

అందరి మనోభావాలూ దెబ్బతిన్నాయి

అన్ని అకౌంట్లూ స్వామి సెటిల్ చేస్తారు: సీఎం

అమరావతి, సెప్టెంబరు 22 : తిరుమల లడ్డూ కల్తీపై ఐజీ, అంతకంటే పైస్థాయి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తిరుమలలో జరిగింది అపచారమని స్పష్టం చేశారు. 'మనోభావాలు దెబ్బతిన్న హిందువులకు, ఇతర మతస్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. అన్నింటి కంటే పెద్దదైన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన సమయంలో అధికార దుర్వినియోగం వల్ల అడుగడుగునా సెంటిమెంట్లు దెబ్బతిన్నాయి. వ్యాపార సంస్థగా, రాజకీయ పునరావాస కేంద్రంగా, వారికి కావలసిన పనులు చేయించుకునేందుకు టీటీడీని ఉపయోగించుకున్నారు. దానిపై చాలా మంది బాధపడ్డారు. ఏదైనా మళ్లీ ప్రజల మనోభావాలను కాపాడే బాధ్యత మేం తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు. ఆదివారమిక్కడి ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్‌తో కలిసి చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఇష్టానుసారంగా టీటీడీ బోర్డు సభ్యులను నియమించారన్నారు.

2లో

## కాళేశ్వరం వృథా కాదు..

కాంగ్రెస్ ప్రభుత్వమే దానిని నిరూపించింది

మాజీ మంత్రి హరీశ్‌రావు







## మళ్లీ హైడ్రా పంజా

కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ

పటాన్‌చెరు: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేశారంటూ హైడ్రా అధికారులు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడలలో భవంతులను నేలమట్టం చేశారు. అమీన్‌పూర్ రెవెన్యూ అధికారుల నివేదిక మేరకు హైడ్రా అధికారులు ఆయా నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి కూల్చివేతల ప్రక్రియను చేపట్టారు. కిష్టారెడ్డిపేట్‌లో మూడు పెద్ద భవనాలను, పటేల్‌గూడలో 22 విల్లాలను కూల్చివేశారు. ఈ ప్రక్రియ ఆదివారం రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. కూల్చివేతల కోసం భారీ క్రేన్లను వినియోగించారు. అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు కూల్చివేత ప్రక్రియలో పాల్గొన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పటేల్‌గూడలో విల్లాలు నిర్మించిన యజమాని అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. అయితే తాము ప్రభుత్వ భూమి పరిధిలోకి వచ్చే నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తున్నామని తహసీల్దార్ రాధ ఆయనకు వివరించారు. విల్లాల నిర్మాణానికి సర్వే నంబర్ 6 పరిధిలో అనుమతులు తీసుకొని

(మిగతా 2వ పేజీలో)

## జాతి వివక్ష ఆరోపణలు.. చిక్కుల్లో నెట్‌ఫ్లిక్స్

కేంద్రం విచారణ






# లడ్డూ అపచారంపై సిట్ దర్యాప్తు



టీటీడీని వినియోగించారని విమర్శించారు. 'వాళ్లు రాగానే నెయ్యి, ఇతర సరుకుల సరఫరాకు సంబంధించి రివర్స్ టెండర్ల పేరుతో నిబంధనలు మార్చారు. 18వ నిబంధనలో ఉన్న మూడేళ్ల అనుభవాన్ని ఏడాదికి తగ్గించారు. డెయిరీ పెట్టిన మూడేళ్ల తర్వాతకు బదులుగా ఏడాదిలోనే నెయ్యి సరఫరా చేయవచ్చని పెట్టారు. 4 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అనుభవం ఉండాలి. ఆ నిబంధనా తీసేశారు. అదే విధంగా 8 టన్నుల ఉత్పత్తి చేయాలన్న నిబంధనా తొలగించారు. రివర్స్ టెండరింగ్‌తో విన్యాసాలు చేశారు. పెద్ద సంస్థలు రాకుండా చేశారు. అనుభవం లేని వారికి, డెయిరీయే లేని వారికి అవకాశమిచ్చారు. దీంతో వారు నాసిరకం నెయ్యి సరఫరా చేశారు. కల్తీ నెయ్యితో అందరి మనోభావాలు దెబ్బతిన్నాయి' అని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

### నిబద్ధత కలిగిన ఈవోను నియమించా..

లడ్డూ మూడ్రోజుల్లోనే చెడిపోవడం, ఘుమఘుమలాడాల్సిన లడ్డూ పాచిపోయినట్లుగా, రంగుమారినట్లుగా కనబడుతుండడంతో తినాలన్నా బాధవేసేది. నేను ముఖ్యమంత్రి కాగానే.. మిగతా పోస్టింగుల గురించి ఆలోచించలేదు. టీటీడీ ఈవోగా ఎవరిని నియమిస్తే ప్రక్షాళన జరుగుతుందో ఆలోచించి శ్యామల రావును నియమించాను. తిరుమలలో అపవిత్ర కార్యక్రమాలు జరిగాయని, ప్రక్షాళన మొదలు పెట్టాలని సూచించా. పుణ్యక్షేత్రానికి పూర్వ వైభవం తేవడానికి భగవంతుడు ఆదేశాలిచ్చాడు.. ఆ ఆదేశాలనే నీకిస్తున్నానని చెప్పాను. అప్పటి నుంచి రోజురోజుకూ పురోగతి చూస్తున్నాం. ఎవరైతే నాసిరకం సరఫరా చేస్తున్నారో ఆ కాంట్రాక్టర్లకు వార్నింగ్ ఇచ్చారు. కల్తీ పరీక్షలు చేసే వ్యవస్థలు టీటీడీలో లేవు. ఇప్పటిదాకా నమ్మకం, పవిత్రతతో పదార్థాల సరఫరా జరిగింది. భయం, భక్తి ఉండడంతో వాటిలో నాణ్యతా ప్రమాణాలు ఉండేవి. ఇప్పుడు తేడా రావడంతో ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ కోసం ఎన్‌డీబీబీకి పంపితే షాకింగ్ నివేదిక వచ్చింది. కల్తీ ఉన్నట్లు తేలింది. సోయాబీన్, సన్‌ఫ్లవర్, ఆలివ్, గ్రాప్‌సీడ్, లిమ్‌సీడ్స్, కాటన్‌సీడ్, ఫిష్ ఆయిల్.. పంది కొవ్వు ఉన్నట్లు అందులో స్పష్టంగా పేర్కొన్నారు. ఇది చూసిన తర్వాత ఈవో జూలై 22, 23ల్లో ఆ కంపెనీ వారికి మెమోలు ఇచ్చారు. ఆ నివేదిక దాచిపెడితే భక్తుల మనోభావాలు ఏ విధంగా ఉంటాయి? రెండ్రోజులు దీనిపై ఆలోచించాం. కేంద్ర మంత్రులు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో మాట్లాడా. జరిగిన అపచారానికి, అపవిత్రతకు బాధపడుతున్నాం. ఎలాంటి చిన్న నిర్లక్ష్యం లేకుండా ప్రక్షాళన చేసి పవిత్రతను కాపాడేందుకు మన వంతు చేయాల్సింది చేయాలని భావిస్తున్నాం. ఏఆర్ కంపెనీ నుంచి వచ్చిన నెయ్యిని వాడేశారు. అది వాడిన తర్వాత శాంపిల్స్‌ను పంపించి నియంత్రించారు. ఆగమ సలహామండలితో చర్చించారు. ఆలయ సంప్రోక్షణపై చర్చించి, ఇప్పుడు వెలుగు చూసిన అంశాల వల్ల ఇతర దోషాలు తొలగిపోయేందుకు సోమవారం ఉదయం శాంతి హోమం నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయంలో బంగారుబావి వద్ద శుద్ధి చేయాలని నిర్ణయించారు. జరిగిన అపచారానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ప్రాయశ్చిత దీక్ష చేస్తున్నారు.

### ఆ అధికారం ఎవరిచ్చారు?

భక్తుల మనోనోభావాలు దెబ్బతిని కుంగిపోయే పరిస్థితి తెచ్చారు. ఆ అధికారం ఎవరిచ్చారు? జగన్.. నీది మనిషి పుట్టుకేనా? కరుడు కట్టిన నేరస్థుడు రాజకీయ ముసుగులో ప్రజలను మోసం చేయడానికి వచ్చి.. అబద్ధాలను సత్యాలుగా చేయాలని చూస్తున్నప్పుడు ప్రమాదమని హెచ్చరిస్తున్నాం. ఎంత ధైర్యముంటే ఎదురుదాడి చేస్తారు? బోర్డు సభ్యులుగా ఎవరిని వేశారు? ఈవోగా ఎవరిని వేశారు? ఇంట్లో ఎవరైనా చనిపోతే ఏడాది పాటు వేంకటేశ్వరస్వామి వద్దకు రారు. కొడుకు చనిపోతే 12వ రోజు గుడికి వస్తావా (అప్పటి ఈవో ధర్మారెడ్డినుద్దేశించి)? అన్య మతస్థులు అబ్దుల్ కలాం, సోనియాగాంధీ సైతం అఫిడవిట్ ఇచ్చి తిరుమలకు వస్తే.. జగన్ ఎందుకు ఇవ్వలేదు? అన్ని అకౌంట్లూ స్వామి సెటిల్ చేస్తారని గతంలో కూడా పలు దఫాలు చెప్పాను. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు స్వామికి ఉన్నది ఏడుకొండలు కాదు.. రెండు కొండలేనంటే పోరాడాను. పాదయాత్ర చేసి ఏడుకొండలూ ఎక్కి మొక్కు తీర్చుకున్నా. దేవుడి పవిత్రత కాపాడేందుకు ఎన్నో చేశాం. అలాంటి పవిత్ర క్షేత్రంలో గడచిన ఐదేళ్లలో అపవిత్ర కార్యక్రమాలు చేశారు. వేంకటేశ్వరస్వామి లడ్డూకు ప్రత్యేకత ఉంది. దానికి కారణం ఎన్నో ఏళ్లుగా దానిని తయారుచేసే విధానమే. అందులోని పదార్థాలు స్వచ్ఛంగా ఉంటాయి. నాణ్యత లేకుండా వాడరు. సరఫరాదారులు కూడా పవిత్రమైన భావంతో సరఫరా చేస్తారు. లడ్డూ మాత్రమే కాదు, జిలేబీ, వడ, పొంగల్ దేనికదే ప్రత్యేకం. భోజన శాలలో వంటలు కూడా రుచికరంగా ఉంటాయి. లడ్డూకు 2009లో పేటెంట్ హక్కు కూడా వచ్చింది. దానిని కాపీ చేసే అవకాశమే లేదు. ఎంత ప్రయత్నించినా తిరుమల లడ్డూ మాదిరి లడ్డూ చేయలేకపోయారు. అలాంటి ప్రసాదంలో నాణ్యత లేదని, అపవిత్రం చేశారని ఎన్నో సార్లు భక్తులు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు తిరుమలలో అన్నదానం, ప్రాణదానం ప్రవేశపెట్టాం. ఎన్టీఆర్ వైకుంఠం కాంప్లెక్-1 నిర్మించారు. నేను వైకుంఠం కాంప్లెక్స్-2 నిర్మించా. రామ్‌దేవ్‌బాబాను తీసుకొచ్చి వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాలతో అనుసంధానం చేసి తిరుమల అంతా ఆయుర్వేద మొక్కలు పెట్టి ప్రోత్సహించాను. శ్రీవారికి సంప్రదాయబద్ధంగా వస్త్రాలు సమర్పించే సమయంలో నాపై క్లెమోర్ మైన్స్ దాడి జరిగింది. ఆ భగవంతుడి కృపవల్ల బతికాను. అన్ని దేవాలయాల్లో అపవిత్రతపై దర్యాప్తు చేసి.. నివేదిక వచ్చాక కఠిన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో నెయ్యి కల్తీ వంటివి జరగకుండా చేస్తాం. ఏ ప్రార్థనా మందిరాల్లో అయినా ఆ మతాల వారి నిర్వహణే ఉండాలి. అందులో నేరస్థులు గానీ, సంఘ విద్రోహ శక్తులు గానీ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో ఇవన్నీ మేం కచ్చితంగా పాటిస్తాం. అందరం మత సామరస్యం కాపాడుకోవాలి. అవసరమైతే ప్రత్యేక చట్టాన్ని తెచ్చి అమలు చేస్తాం. అన్ని దేవాలయాల్లో మహిళలను గౌరవించే విధంగా ప్రత్యేక సిఫారసులు తీసుకుని చర్యలు తీసుకుంటాం.

# జాతి వివక్ష ఆరోపణలు.. చిక్కుల్లో నెట్‌ఫ్లిక్స్

**కేంద్రం విచారణ**

న్యూఢిల్లీ: ఇంటిపాల్లిదికి వినోదాన్ని పంచే నెట్‌ఫ్లిక్స్ చిక్కుల్లో పడింది. జాతి వివక్ష, వీసా ఉల్లంఘనకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ యూఎస్ స్ట్రీమింగ్ దిగ్గజంపై భారత ప్రభుత్వం దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిసింది. ఆ సంస్థ ఇండియా బిజినెస్, లీగల్ అఫైర్స్ మాజీ డైరెక్టర్ నందినీ మెహతాకు 20 జూలై 2020లో పంపిన ఈ-మెయిల్‌లో పేర్కొన్న ఈ విషయం తాజాగా వెలుగు చూసింది. భారత్‌లో నెట్‌ఫ్లిక్స్ తన కార్యకలాపాల నిర్వహణలో ప్రవర్తనా నియమావళితోపాటు వీసా నిబంధనల ఉల్లంఘన, చట్ట విరుద్ధ నిర్మాణాలు, జాతి వివక్ష వంటి చర్యలకు పాల్పడినట్టు హోం శాఖలోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్‌వో)కు చెందిన భారత అధికారి దీపక్ యాదవ్ లేఖ రాశారు. మరోవైపు, నెట్‌ఫ్లిక్స్ తనను అన్యాయంగా తొలగించిందంటూ నందినీ మెహతా ఆరోపించారు. ఇందుకు సంబంధించి నెట్‌ఫ్లిక్స్‌పై అమెరికా కోర్టులో పోరాటడనున్నట్టు చెప్పారు. భారత ప్రభుత్వ దర్యాప్తును స్వాగతిస్తున్నట్టు చెప్పిన మెహతా.. ఆ నివేదికను బయట పెట్టాలని కోరారు. కాగా, నెట్‌ఫ్లిక్స్ మాత్రం జాతి, లింగ వివక్ష ఆరోపణలను తోసిపుచ్చింది. భారత ప్రభుత్వ దర్యాప్తు గురించి తమకు తెలియదని ఆ సంస్థ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

# 'అమృత్'లో అక్రమాలు తేలకపోతే రాజకీయ సన్యాసం

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్ల విషయంలో మంత్రి పొంగులేటి విసిరిన సవాలును స్వీకరిస్తున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అమృత్ పథకం టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. వెంటనే కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) లేదంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. 'నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం.. వెంటనే సిట్టింగ్ జడ్జితోని ఎంక్వయిరీ చేయిద్దాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పులు ఏం జరగలేదు అంటే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. హైకోర్టు సీజే దగ్గరికి రావడానికి మంత్రిగారికి ఇబ్బంది ఉందంటే డేట్, టైం ఫిక్స్ చేయండి ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ దగ్గరికి పోదాం. మంత్రిగారికి, ముఖ్యమంత్రికి ఒకటే చెప్తున్నా.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న ఫైల్స్‌తో పాటు ఇప్పటి టెండర్ల వ్యవహారం వివరాలు సీవీసీ లేదా రిటైర్డ్ జడ్జి ఎదుట ఉంచుదామని, న్యాయంగా తీర్పు చెప్పిన తర్వాత తాను చెప్పింది అబద్ధమంటే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం చేస్తానని స్పష్టంచేశారు. పొంగులేటి గతంలో కాంట్రాక్టర్‌గా ఉంటే ఉండొచ్చు కానీ ఈ రోజు మంత్రిగా ఉండి కాంట్రాక్టులు సంపాదించడం ముమ్మాటికి చట్టవ్యతిరేకమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని సీఎంతోపాటు మంత్రి పొంగులేటికి కూడా తెలుసని పేర్కొన్నారు. కేవలం రెండు కోట్ల లాభం ఉన్న బామ్మర్ది కంపెనీకి రూ.1000 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదంటే ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను కూడా తాను ప్రస్తావించిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఆగమేఘాలమీద ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహిం చారని తెలిపారు. ముఖ్యమంత్రి భార్యకి సూదిని సృజ న్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడని, భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతా డో పొంగులేటి చెప్పాలని నిలదీశారు. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ. 8,888 కోట్ల అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవా లని సూచించారు. ఇప్పటికైనా జరిగిన తప్పును సీఎం ఒప్పుకొని జరిగిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని సూచించారు. పొంగులేటి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే రాజీనామా చేయాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని, ఈ బరితెగింపు మాటలు మానివేయాలని సూచించారు. లేకుంటే గతంలో అశోక్ చౌహాన్, యడ్యూరప్ప, సోనియాగాంధీ పదవులు పోయినట్టు మీ పదవులు కూడా పోతాయని హెచ్చరించారు.

# ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త!

(మొదటి పేజీ తరువాయి)

నియమించాం. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే వారి జనాభాను లెక్కించాల్సిందే. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ సుప్రీం తీర్పును పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక ఇస్తుంది. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోదీ ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగోసారి గెలవడం కోసమే జమిలి ఎన్నికలు తీసుకువస్తున్నారు. ఈ ప్రతిపాదన పట్ల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలి.." అని రేవంత్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఈ తొమ్మిది నెలల కాలంలో తాను ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశానని సీఎం రేవంత్ చెప్పారు. అధికారం కోల్పోయిన అసహనంతో ప్రతిపక్షం తప్పుడు ప్రచారాలు చేస్తోందని, ఆ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 27 రోజుల్లో రూ.18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదని.. తెలంగాణలో చేసి చూపించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తామని, రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రజల్లో ఉన్న వారికే కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులు వస్తాయన్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు వారానికి రెండు సార్లు తమ జిల్లాలో పర్యటించాలని సూచించారు.

# చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా?



ఎలా సమర్థిస్తారు? కోట్ల మంది హిందువులు స్వీకరించే ప్రసాదాన్ని అపవిత్రం చేస్తారా? దోషులకు శిక్ష పడాల్సిందే. చర్చి, మసీదులో ఇలా జరిగితే దేశం అల్లకల్లోలం అయిపోయేది. ప్రపంచం అంతా మాట్లాడేది. గ్లోబల్ న్యూస్ అయ్యేది. అదే హిందువులకు జరిగితే మాట్లాడకూడదా? సెక్యూలర్ వ్యవస్థకు విఘాతం కలుగుతుందా? హిందువులకు మనోభావాలు ఉండవా? ఏ మతంపై దాడి జరిగినా ఇలాగే స్పందిస్తాం. గత ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని సూటిగా అడుగుతున్నాను. తిరుమలలో జరిగిన విధంగా ఒక చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా? ఒక మసీదుకు జరిగితే ఊరుకుంటావా? మరి తిరుమలలో అపవిత్రం జరిగితే ఎందుకు మాట్లాడకూడదని అంటున్నారు? మేము మాట్లాడతాం. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఏ మతం మీద దాడి జరిగినా మాట్లాడతాం. సనాతన ధర్మంపై దాడి జరిగినా మాట్లాడుతాను. తిరుమల ఘటనలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందే. ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నాను. గత ప్రభుత్వ హయాంలో టీటీడీలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, అపచారాలపై విచారణ జరగాలి. దోషులను శిక్షించాలి. నిన్న మీడియా ప్రతినిధులు సీబీఐ విచారణకు ఈ కేసు తీసుకువెళ్తారా అని అడిగారు. కేబినెట్‌లో చర్చ జరిగే విధంగా చూసి, దీనిపై నిర్ణయం తీసుకోవలసిందిగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా మేము సహకరిస్తాం. తిరుమలలో జరిగిన ఘటన భవిష్యత్తులో జరగకుండా చ్యూసలా మా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది" అని పవన్ స్పష్టం చేశారు. "నెయ్యి కల్తీపై గత టీటీడీ బోర్డు బాధ్యత వహించాలి. నాటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఇతర పాలక వర్గంపై విచారణ జరగాలి. తప్పులు చేస్తే మాది ఉపేక్షించే ప్రభుత్వం కాదు. టీటీడీ బోర్డు ఉన్నది ధర్మాన్ని పరిరక్షించడానికి మాత్రమే. దర్శనం టికెట్లు మీ వారికి ఇచ్చుకోవడానికో, మీ ఇష్టానికి కాంట్రాక్టులు ఇవ్వడానికో కాదు" అని పవన్ అన్నారు.

### ఒక్కరూ ప్రశ్నించలేదు

"తిరుమలలో ప్రతి రోజు దాదాపు 15వేల కిలోల నెయ్యి వినియోగిస్తారు. కిలో నెయ్యి తయారీకి దాదాపు రూ.వెయ్యి ఖర్చవుతుంది. అలాంటిది రూ.360కే వస్తుందని మధ్యవర్తి చెబితే క్వాలిటీ చెక్ చేయకుండా ఎలా తీసుకుంటారు.? స్వామివారి ప్రసాదంలో కల్తీ జరుగుతుంటే అధికారులు, బోర్డు సభ్యులు ఎందుకు మాట్లాడలేదు? వైసీపీ అంటే భయమా? లేక సుబ్బారెడ్డి అంటే భయమా? ఉద్యోగులు మౌనంగా ఉండి మహా అపరాధం చేశారు. ఈ అపరాధంతో నాకు సంబంధం లేకపోయినా ప్రాయశ్చిత్త దీక్ష తీసుకుంటున్నాను. శ్రీవాణి ట్రస్టు పేరుతో రూ.10 వేలు వసూలు చేశారు. ఐదుగురు కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనానికి వస్తే రూ.50వేలు వసూలు చేసి బిల్లు మాత్రం రూ.500 చొప్పునే ఇచ్చారు. తప్పు జరుగుతోందని వేలెత్తి చూపినా వైసీపీ నాయకులు పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రసాదాల నాణ్యత తగ్గిపోయింది. లడ్డూను కూడా కల్తీ చేశారు. గత ప్రభుత్వంలో 219 ఆలయాలను అపవిత్రం చేశారు. రథాలు తగలబెట్టారు. రామతీర్థం ఆలయంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేశారు. దోషులను పట్టుకోలేకపోయారు. వైసీపీ తప్పులకు ఫుల్ స్టాప్ పెట్టాలి. దాడులు జరుగుతున్నప్పుడు చూస్తూ కూర్చోవడం కూడా తప్పే. ధర్మాన్ని పాడు చేసే హక్కు ఎవరికి లేదు. పగ, ప్రతీకారం తీర్చుకునే ప్రభుత్వం కాదు మాది" అని పవన్ అన్నారు.

# నిలబడతాం.. బలపడతాం క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

వాషింగ్టన్, సెప్టెంబరు 22: "క్వాడ్ కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం. భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వాతావరణ మార్పులు, సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యం. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడమే క్వాడ్ అభిమతం. మేం(క్వాడ్ కూటమి) నిలబడతాం.. బలపడతాం" అని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్‌లో ఆదివారం జరిగిన క్వాడ్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లక్రితం ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, భద్రత వంటి అంశాలతో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్ కలిసి క్వాడ్ కూటమిగా ఏర్పడ్డ విషయం తెలిసిందే..! ఈ కూటమి ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన సదస్సులో మోదీ, బైడెన్‌తోపాటు.. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనెస్, జపాన్ ప్రధాని కిషిదా పాల్గొన్నారు. క్వాడ్‌కు వ్యతిరేకంగా చైనా వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో.. మోదీ ఆ దేశం పేరును ప్రస్తావించకుండా తాము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తామని, ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తమ సందేశం ఒక్కటేనని, బలంగా నిలబడి, సభ్యదేశాల సహకారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. "ప్రపంచంలో ఉద్రిక్తతలు, సంఘర్షణలు చోటుచేసుకుంటున్న సమయంలో క్వాడ్ కూటమి ఏర్పాటైంది. మానవాళి శ్రేయస్సుకు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కంకణబద్ధమైంది. క్వాడ్ సదస్సులో ఫలవంతమైన చర్చలు జరిగాయి. ప్రపంచానికి మేలు జరిగేలా ఇంకా సమర్థంగా పనిచేయాలని నిర్ణయించాం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి సహకరించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అంతకు ముందు ఆయన 'క్వాడ్ క్యాన్సర్ మూన్‌షాట్ ఈవెంట్'లో మాట్లాడుతూ.. ఇండో-పసిఫిక్ రీజియన్ దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, గుర్తింపు, చికిత్సకు భారత్ తరఫున రూ.62.61 కోట్ల(7.5 మిలియన్ డాలర్లు)ను అందజేస్తామని ప్రకటిస్తూ.. తమ లక్ష్యం 'ఒక భూగోళం.. ఒక ఆరోగ్యం' అంటూ నినదించారు. ఈ రీజియన్‌లోని దేశాలకు 4 కోట్ల డోసుల క్యాన్సర్ టీకాలను అందజేస్తామన్నారు.

# మళ్లీ హైడ్రా పంజా

సర్వే నంబర్ 12లో నిర్మిస్తున్నట్లు గుర్తించామని ఆమె స్పష్టం చేశారు. కాబట్టి ఎలాంటి కోర్టు స్టే ఆర్డర్ కూల్చివేతల ప్రక్రియలకు అడ్డుకాదని చెప్పారు. కిష్టారెడ్డిపేట్‌లో సర్వే నంబర్ 164లో మూడు భవంతుల నిర్మాణాలు జరిగాయని, వాటిని కూడా తొలగిస్తున్నట్లు తెలిపారు. కిష్టారెడ్డిపేట్‌లో సర్వే నంబర్ 164లో ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేశారని వారికి నోటీసులు ఇచ్చి తొలగిస్తున్నామని స్పష్టం చేశారు. కూల్చివేత ప్రక్రియకు ముందే హైడ్రా, రెవెన్యూ అధికారులు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని ప్రభు త్వ భూమి పరిధిలోకి వచ్చే ప్రాంతాన్ని పరిశీలించి కూల్చివేతలకు ఉపక్రమించారు. సా మాన్య ప్రజలకు, పరిసర నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీ సుకున్నారు. కూల్చివేతల్లో ఒక డాక్టర్ భవనం కూడా ఉండటం గమనార్హం. మరో భవ నం ఏపీలోని ఒక ఎమ్మెల్యేకు సంబంధించిందని చెబుతున్నారు. ఈ సందర్భంగా బాధితు లు తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ప్లాట్లను కొనుగోలు చేసి నిర్మాణాలు చేశామే తప్ప.. కబ్జా చేసి బహుళ అంతస్తులు నిర్మించలేదని వాదిస్తున్నారు.

### మరిన్ని కూల్చివేతలు..

కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతుందని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కిష్టారె డ్డిపేట్ పరిసర గ్రామాల పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో జరిగిన నిర్మాణాల కూల్చివేతకు అధి కారులు నివేదిక రూపొందించినట్లు తెలిసింది. పొరుగు గ్రామాల ప్రభుత్వ భూముల్లో కిష్టారెడ్డిపేట్ పంచాయతీ అనుమతులతో జరిగిన నిర్మాణాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అదే గ్రామంలో చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను కూడా రెవెన్యూ అధికారులు గుర్తించి హైడ్రాకు నివేదిక ఇచ్చి నట్టు సమాచారం.



# రుణాలకు దారేది

## నిబంధనల్ని కఠినతరం చేసిన బ్యాంకులు

## సామాన్యులకు పుట్టని అప్పులు

## గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా రుణాలు జటిలం

## రకరకాల కొర్రీలతో ఏ లోన్లూ దొరకని వైనం

ముంబై: కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ వేసిమరీ వందలు, వేల కోట్ల రూపాయల్ని అప్పుగా ఇస్తున్న బ్యాంకర్లు.. సామాన్యులకు మాత్రం లక్ష కొర్రీలు పెడుతూ మొండిచెయ్యి చూపిస్తున్నారు. పెరుగుతున్న రిటైల్ రుణాలు ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నాయంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చేసిన హెచ్చరికలతో అప్రమత్తమైన బ్యాంకింగ్ సంస్థలు.. నిబంధనల్ని కఠినతరం చేసేశాయి. ఈ ప్రభావం పెద్దలపై ఎలా ఉన్నా.. మధ్యతరగతివారిపై మాత్రం పెద్దగానే పడుతున్నది. లక్ష రూపాయల పర్సనల్ కోసం వెళ్లినా.. 10 లక్షల గృహ రుణం కోసం అడిగినా.. రూల్స్ మీద రూల్స్ చెబుతూ సగటు మనిషి గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి బ్యాంకులు. ముఖ్యంగా షూరిటీల కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తున్నదని చాలామంది వాపోతున్నారు.


### ఎన్‌బీఎఫ్‌సీల్లోనూ..

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోనూ రుణగ్రహీతలకు ఇదే పరిస్థితి ఎదురవుతున్నది. ఇక ఉద్యోగేతరులపై వడ్డీభారం భారీగా పడుతున్నది. కొన్నైతే 14 శాతం నుంచి 22 శాతం మేర వసూలు చేస్తుండటం గమనార్హం. సిబిల్ స్కోర్, స్థిరాస్తి లావాదేవీల్లో సమస్యలనుబట్టి ఈ వడ్డీరేట్లుంటున్నాయి. నిజానికి మొండి బకాయి (నిరర్థక ఆస్తి లేదా ఎన్‌పీఏ)లు కార్పొరేట్ రుణాల్లోనే ఎక్కువ. రుణాల్ని ఎగవేసేదీ బడా వ్యాపార, పారిశ్రామికవేత్తలేనని ఎన్‌పీఏ గణాంకాలూ చెప్తున్నాయి. అయినప్పటికీ కఠినం చేసిన నిబంధనలు సామాన్య రుణగ్రహీతల్నే ఎక్కువగా ఇబ్బందిపెడుతున్నాయి.

### మార్కెట్‌పై ప్రభావం

బ్యాంకింగ్ రుణాల లభ్యత లేక ఆటో, రియల్టీ, కన్స్యూమర్ గూడ్స్ మార్కెట్లలో నీరసం కనిపిస్తున్నది. వాహన, నిర్మాణ రంగాలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. దీంతో ఆటో సంస్థలు ఆయా ఫైనాన్స్ కంపెనీలతో ప్రత్యేకంగా తమ వాహన అమ్మకాల కోసం జట్టు కడుతున్నాయి. బడా రియల్టర్లూ కస్టమర్లను ఆకట్టుకునేందుకు లోన్ మేళాల్ని నిర్వహిస్తున్నారు. అసలే ఆర్థిక మందగమనం ఛాయలు కనిపిస్తున్న తరుణంలో కఠిన బ్యాంకింగ్ నిబంధనలు మార్కెట్‌కు శరాఘాతంలా పరిణమిస్తున్నాయి. దీంతో రుణ ఎగవేతల్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవడం బాగానే ఉన్నా.. అతితో అనర్థాలేనని ఆర్థిక నిపుణులూ హెచ్చరిస్తున్నారు.

### ఆదాయంపై అబద్ధాలు..




రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆదాయాన్ని ఎక్కువగా పేర్కొనడం సాధారణంగా జరిగేదేనని ప్రతీ ఐదుగురు భారతీయుల్లో ముగ్గురు (63 శాతం) అభిప్రాయపడ్డట్టు ఓ తాజా సర్వే తెలిపింది. అయితే ఈ విషయంలో అంతర్జాతీయ సగటు 39 శాతంగానే ఉన్నది. గ్లోబల్ అనలిటిక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఫికో.. దేశీయంగా నిర్వహించిన ఈ సర్వేలో ఉద్దేశపూర్వకంగానే గృహ, వ్యక్తిగత రుణాల కోసం తమ ఆదాయంపై అబద్ధాలు ఆడుతున్నట్టు 27 శాతం మంది స్పష్టం చేశారు. ఇక బీమా క్లెయిముల కోసం తప్పుడు సమాచారం ఇస్తున్నామని 54 శాతం అంగీకరించారు. కానీ 33 శాతం మంది ఈ రకమైన తీరు అస్సలు ఆమోదయోగ్యం కాదంటున్నారు. వారంతా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. కాగా, 35 శాతం మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో అబద్ధాలు ఆడితే తప్పేమిటన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



# హైదరాబాద్‌లో పడిపోయిన ఇళ్ల అమ్మకాలు

## జూలై-సెప్టెంబర్ మధ్య 42 శాతం తక్కువ

## ప్రధాన పట్టణాల్లో 18 శాతం క్షీణత

## ప్రాప్ ఈక్విటీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల విక్రయాలు జూలై%-%సెప్టెంబర్ కాలంలో సుమారు 42 శాతం మేర తక్కువగా నమోదవుతాయని రియల్ ఎస్టేట్ అనలైటిక్ సంస్థ ప్రాప్ ఈక్విటీ అంచనా వేసింది. 12,082 యూనిట్ల విక్రయాలు ఉండొచ్చని, క్రితం ఏడాది ఇదే త్రైమాసిక కాలంలో విక్రయాలు 20,658 యూనిట్లుగా ఉన్నట్టు తన తాజా నివేదికలో పేర్కొంది. దేశవ్యాప్తంగా తొమ్మిది ప్రధాన పట్టణాల్లో సెప్టెంబర్ త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు మొత్తం మీద 18 శాతం తగ్గి 1,04,393 యూనిట్లుగా ఉండొచ్చని తెలిపింది. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలు 1,26,848 యూనిట్లుగా ఉన్నాయి. తొమ్మిది పట్టణాలకు గాను ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 22 శాతం, నవీ ముంబైలో ఇళ్ల అమ్మకాల్లో 4 శాతం చొప్పున వృద్ధి ఉంటుందని పేర్కొంది. మిగిలిన అన్ని పట్టణాల్లో క్షీణించొచ్చని అంచనా వేసింది.


**పట్టణాల వారీగా..**

- బెంగళూరులో ఇళ్ల అమ్మకాలు జూలై%-%సెప్టెంబర్ కాలంలో 26% క్షీణించి 13,355 యూని ట్లుగా ఉంటాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 17,978 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- చెన్నై మార్కెట్లో 18 శాతం తక్కువగా 4,634 యూనిట్ల విక్రయాలు జరగొచ్చు.
- కోల్‌కతా మార్కెట్లో 23% తక్కువగా 3,590 యూనిట్లు అమ్ముడుపోవచ్చు.
- పుణెలోనూ 19% క్షీణించి అమ్మకాలు 21,306 యూనిట్లుగా ఉంటాయి.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో ఇళ్ల అమ్మకాలు 10% తగ్గి 20,460 యూనిట్లుగా ఉండొచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో 22,802 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- ముంబైలో 17 శాతం తక్కువగా 10,966 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదు కావచ్చు. అదే నవీ ముంబైలో మాత్రం 4 శాతం అధికంగా 7,737 యూనిట్ల అమ్మకాలు జరగొచ్చు.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో 22 శాతం వృద్ధితో 10,263 యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదు అవుతాయి.


**సాధారణమే..**

"రియల్ ఎస్టేట్ పరిశ్రమలో డిమాండ్ బలంగానే ఉంది. ప్రస్తుత త్రైమాసికంలో విక్రయాలు కొత్త ఆవిష్కరణల కంటే ఎక్కువే ఉన్నాయి. కానీ, అమ్మకాల్లో స్వల్ప క్షీణత అన్నది చరిత్రాత్మకంగా ఉన్న ధోరణే కానీ, ప్రతికూల పరిస్థితులకు సూచిక కాదు" అని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజ తెలిపారు.

# ఒక్క డీల్‌తో దూసుకెళ్లిన ఫిజిక్స్‌వాలా



న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ యూనికార్న్ ఫిజిక్స్‌వాలా తాజాగా రూ.1,753 కోట్ల నిధులను సమీకరించింది. సిరీస్-బి రౌండ్‌లో హార్న్‌బిల్ క్యాపిటల్, లైట్‌స్పీడ్ వెంచర్ పార్ట్‌నర్స్, జీఎస్‌వీ, వెస్ట్‌బ్రిడ్జ్ ఈ మొత్తాన్ని అందించాయి. ఈ డీల్‌తో కంపెనీ విలువ ఏడాదిలో రెండున్నర రెట్లు దూసుకెళ్లి రూ.23,380 కోట్లకు చేరింది. పెద్ద సంస్థల వాల్యుయేషన్‌లో గణనీయమైన తగ్గుదల కారణంగా భారతీయ ఎడ్‌టెక్ రంగంలో పెద్ద ఎత్తున నిధుల కొరత చాలా కాలంగా ఉంది. 'ఎడ్‌టెక్ రంగానికి సవాలుగా ఉన్న ప్రస్తుత సమయంలో తాజా ఫండింగ్ రౌండ్ ఆశావాదానికి దారితీసింది. కంపెనీ అభివృద్ధి, దేశం అంతటా విద్యను ప్రజాస్వామ్యం చేయాలనే లక్ష్యంపై ఇప్పటికే ఉన్న, కొత్త పెట్టుబడిదారుల అచంచల విశ్వాసానికి ఇది నిదర్శనం' అని ఫిజిక్స్‌వాలా తెలిపింది.



# ఖరీదైన అపార్ట్‌మెంట్ కొన్న దీపికా పదుకొణె కంపెనీ

బాలివుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణెకు చెందిన సంస్థ కేఏ ఎంటర్‌ప్రైజెస్ లగ్జరీ అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసింది. ముంబైలోని బాంద్రా వెస్ట్ ప్రాంతంలో రూ.17.8 కోట్లకు 1845 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్‌ల సమాచారాన్ని సేకరించే జాప్‌కీ సంస్థకు లభించిన పత్రాలు ఈ కొనుగోలు వివరాలను వెల్లడించాయి. ఈ సేల్ డీల్ సెప్టెంబర్ 12న నమోదైంది. ఎనార్మ్ నాగ్‌పాల్ రియాల్టీ సంస్థ విక్రేత కాగా దీపికా పదుకొణె కంపెనీ కేఏ ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలుదారుగా పత్రాలు చూపించాయి.పికా పదుకొణె కంపెనీ అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసిన సాగర్ రేషమ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీని ఎనార్మ్ నాగ్‌పాల్ రియాల్టీ సంస్థ అభివృద్ధి చేసింది. ఇందులో 4బీహెచ్‌కే, 5 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. కంపెనీ కొనుగోలు చేసిన ఫ్లాట్ 15వ అంతస్తులో ఉంది. బిల్ట్-అప్ ఏరియా రేటు చదరపు అడుగుకు రూ. 96,400. ఈ డీల్‌కు స్టాంప్ డ్యూటీ దాదాపు రూ. 1.07 కోట్లు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ. 30,000 చెల్లించినట్లు తెలుస్తోంది.బాలివుడ్ స్టార్ కపుల్ దీపికా పదుకొణె, రణవీర్ సింగ్ ఇటీవలే తమ మొదటి బిడ్డకు జన్మనిచ్చారు. కాగా ఈ దంపతులు కొనుగోలు చేసిన మరొక ప్రాపర్టీ షారూఖ్ ఖాన్ రాజభవనం మన్నత్‌కు సమీపంలోని బాంద్రా బ్యాండ్‌స్టాండ్‌లో సముద్రానికి ఎదురుగా ఉన్న క్వాడ్రప్లెక్స్. దీని విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని సమాచారం. ఈ జంట 2021లో అలీబాగ్‌లో రూ. 22 కోట్ల విలువైన బంగ్లాను కూడా కొనుగోలు చేశారు.

# మార్కెట్లోకి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బెటాలియన్ బ్లాక్..!

ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ 350 మోటారు సైకిళ్లను విస్తరిస్తోంది. తాజాగా రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ 350 'బెటాలియన్ బ్లాక్' మోటారు సైకిల్‌ను శుక్రవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.1,74,730 పలుకుతుంది. ఐకానిక్ మోడల్ మోటారు సైకిల్ పలు మార్పులతో వస్తోంది. వింటేజ్ డిజైన్ క్యూస్, బెటాలియన్ బ్లాక్ ఎడిషన్ మోటారు సైకిళ్లు పాత మోడల్ బైక్స్ నుంచి బెంచ్ సీట్, హ్యాండ్ పెయింటెడ్ గోల్డ్ పిన్ స్ట్రైప్స్, ట్యాంక్ అండ్ సైడ్ ప్యానెల్స్ మీద 3డీ బ్యాడ్జెస్ వంటి పలు రెట్రో ఫీచర్లను తీసుకొస్తోంది రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 350 బెటాలియన్ బ్లాక్ మోటారు సైకిల్. స్పోక్ వీల్స్‌తోపాటు క్రోమ్ రిమ్స్, బ్లాక్ మిర్రర్స్, ఓల్డ్ లైసెన్స్ ప్లేట్, టెయిల్ లాంప్ రిమినిస్కెంట్ వంటి ఫీచర్లు జత చేశారు.జే-ప్లాట్ ఫామ్ పై రూపుదిద్దుకున్న 349సీసీ సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్ మోటారు కలిగి ఉంటుంది. ఈ ఇంజిన్ గరిష్టంగా 20.2 హెచ్పీ విద్యుత్, 27 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 5-స్పీడ్ గేర్ బాక్స్ ఉంటది. సేఫ్టీని పెంపొందించే సింగిల్ చానెల్ ఏబీఎస్‌తో కూడిన 300 ఎంఎం ఫ్రంట్ డిస్క్, 153 ఎంఎం రేర్ డ్రమ్ బ్రేక్స్ ఉంటాయి. ఇక మిలిటరీ వేరియంట్ బెటాలియన్ బ్లాక్ ఎడిషన్, బ్లాక్ గోల్డ్ స్టాండర్డ్ వేరియంట్లలో లభిస్తుందీ రాయల్ ఎన్ ఫీల్డ్ 'బెటాలియన్ బ్లాక్' మోటారు సైకిల్. ఫెస్టివ్ సీజన్ నేపథ్యంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ బ్లాక్ బెటాలియన్ ఆవిష్కరించడం ప్రాధాన్యం సంతరించుకున్నది.





# అనిల్ అంబానీ కంపెనీలో భారీ పెట్టుబడులు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రమోటర్లు ఈక్విటీ రూపేణా రూ. 1,100 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. వీటికి జతగా ముంబైకి చెందిన రెండు ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు రూ. 1,900 కోట్లు అందించనున్నట్లు కంపెనీ పేర్కొంది. గురువారం సమావేశమైన కంపెనీ బోర్డు రూ. 6,000 కోట్ల సమీకరణ ప్రణాళికలకు ఆమోదముద్ర వేసింది. వీటిలో రూ. 3,014 కోట్లు ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా అందుకోనుంది. మిగిలిన రూ. 3,000 కోట్లు సంస్థాగత కొనుగోలుదారుల నుంచి సమీకరించనుంది. తొలి దశలో భాగంగా షేరుకి రూ. 240 ధరలో 12.56 కోట్ల ఈక్విటీ షేర్లు లేదా మార్పిడికి వీలయ్యే వారంట్ల జారీ ద్వారా రూ. 3,014 కోట్లు సమకూర్చుకోనుంది. వీటిలో ప్రమోటర్ సంస్థ రైజీ ఇన్‌ఫినిటీ ప్రయివేట్ 4.6 కోట్ల షేర్లకు సబ్‌స్క్రయిబ్ చేయనుంది. ఈ బాటలో ముంబై సంస్థలు ఫార్చ్యూన్ ఫైనాన్షియల్ అండ్ ఈక్విటీస్ సర్వీసెస్(4.41 కోట్ల షేర్లు%-% రూ. 1,058 కోట్లు), ఫ్లోరిన్‌ట్రీ ఇన్నొవేషన్స్ ఎల్ఎల్‌పీ(3.55 కోట్ల షేర్లు - రూ. 582 కోట్లు) చొప్పున ప్రిఫరెన్షియల్ ఇష్యూలో భాగంకానున్నాయి. పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ మాజీ ఎగ్జిక్యూటివ్ మాథ్యూ సైరియా ఫ్లోరిన్‌ట్రీని ఏర్పాటు చేయగా.. ఫార్చ్యూన్ ఫైనాన్షియల్‌ను నిమిష్ షా నెలకొల్పారు. రిలయన్స్ ఇన్‌ఫ్రాలో ప్రమోటర్లకు ప్రస్తుతం 21.34 శాతం వాటా ఉంది.

# యువ రైతు ను అభినందించిన మంత్రి సీతక్క

మంచిర్యాల జిల్లా ప్రతినిధి,,క్రైమ్ మిర్రర్ : నేటి సమాజానికి ఆదర్శం అని లోకరి గ్రామ యువ రైతు గెడం.ప్రభాకర్ అని అభినందించిన...జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా అదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన లోకారి గ్రామ రైతుగేడం. ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రైతు రుణమాఫి పథకంలో భాగంగా వచ్చిన ఒక్క లక్ష రూపాయల నుండి ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భారీ వర్షాలకు నష్టపోయిన వారికి తనవంతు సహాయంగా 10,000 లను విరాళంగా ఇవ్వడం జరిగింది,ఈ సందర్భంగా రైతును మంత్రి అభినందించారు, రైతు ప్రభాకర్ మాట్లాడుతూ అకాల వర్షాలకు రాష్ట్ర ప్రజలు సర్వస్వం కోల్పోయారని చూసి మనసుకు బాధ కలిగింది అనివిపత్తుల వలన నష్టం జరిగితే ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకోవాలని అప్పుడే అందరం మనోధైర్యం కోల్పోకుండా ఉంటారు అని స్పష్టం చేశారు,ఇంకా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకం చేపట్టే కార్యక్రమాన్ని రూరల్ మండలం లొకారి గ్రామం నుండి ప్రారంభించాలని ఈ సందర్భంగా మంత్రి సితక్కకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ. భొజ్జు పటేల్ పెండోర్.విశ్వ నాథ్ గేడం.నవీన్ మడవి. శుక్ల పాల్గొన్నారు.






# సీఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## బంజార ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ దశరథనాయక్

**క్రైమ్ మిర్రర్,మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత దశరథనాయక్ కోరారు. ఆదివారం మిర్యాలగూడలో జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో ఆశ పెట్టుకున్నారని వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రావాల్సిన 4 డిఎలలో దసరా కానుకగా కనీసం రెండు మంజూరు చేయాలని కోరారు. పండుగకు ముందు ప్రకటించి అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకొని వాటిపై ఉద్యోగ సంఘాలతో చర్చించి వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి అమలు పరిచేలా తగిన చొరవ చూపాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ కార్డులు షరతులు లేకుండా కార్పొరేట్ వైద్యశాలలు వైద్యమందించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎన్నికల ముందు బదిలీలు చేసిన రెవిన్యూ, పంచాయతీ రాజ్ ఉద్యోగులు, తహసీల్దార్,ఎంపిడిఓలను పూర్వస్తానాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖలలో అర్హత వున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు గోపీనాయక్, జంలానాయక్, సైదా నాయక్,లాలునాయక్, మక్లా నాయక్, రమేష్ నాయక్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

# శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు

## వార్త తెలియగానే భక్తుడిగా తల్లడిల్లి పోయా

## నేరస్థులను కఠినంగా శిక్షించాల్సిందే

## సిఎం చంద్రబాబును కోరిన నటుడు మోహన్ బాబు

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుని కలుపుతున్నారని వార్తలు తెలియగానే ఒక భక్తుడిగా తల్లడిల్లిపోయానని సీనియర్ నటుడు మోహన్‌బాబు అన్నారు. ఆ స్వామి దగ్గర ఇలా జరగడం ఘోరం, పాపమని, ఇదేగాని నిజమైతే నేరస్థులను శిక్షించాలని ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రపంచ వ్యాప్తంగా ప్రతి హిందువు పూజించే కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి. ఆ దైవానికి నిత్యం సమర్పించే లడ్డూలలో కలిపే ఆవు నెయ్యిలో దాదాపు 3 నెలల క్రితం వరకు ఇతర జంతువుల కొవ్వుని కలుపు తున్నారని తెలియగానే ఒక భక్తుడిగా తల్లడిల్లిపోయాను. తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. నిత్యం 'మోహన్‌బాబు విశ్వవిద్యాలయం' నుంచి కనిపించే తిరుమల క్షేత్రాన్ని చూసి నాతో పాటు వేల మంది ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, భక్తిపూర్వకంగా నమస్కరించుకుంటూ ఉంటాం. ఆ స్వామి దగ్గర ఇలా జరగడం ఘోరం, పాపం, ఘోరాతి ఘోరం, నికృష్టం, అతినీచం, హేయం, అరాచకం. ఇదే నిజమైతే నేరస్థులను శిక్షించాలని నా ఆత్మీయుడు, నా మిత్రుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని హృదయపూర్వకంగా కోరుకుంటూ... ఈ కలియుగ దైవం శ్రీనివాసుని ఆశీస్సులు నా మిత్రుడు అందుకుని నూరేళ్ళు చల్లగా ఉండాలని కోరుకుంటున్నాను'ఇక మోహన్‌బాబు సినిమాల విషయానికొస్తే, తనయుడు మంచు విష్ణుతో కలిసి 'కన్నప్ప'లో నటిస్తున్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

## జలమయం అయిన లోతట్టు ప్రాంతాలు

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** భాగ్యనగరంలో భారీ వర్షం పడుతోంది. నగరంలో కుండపోతగా వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం ధాటికి లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడుతోంది. వర్షం ధాటికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆఫీసుల నుంచి ఇంటికి వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ జాంలో ఇరుక్కుపోయారు.కోఠి, బషీర్‌బాగ్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, నారాయణగూడ, ముషీరాబాద్, సికింద్రాబాద్, హిమాయత్ నగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, నారాయణగూడ, ఉప్పల్, ఎల్‌బీ నగర్, కంటోన్మెంట్, నాగోల్, తార్నాక, నాంపల్లి, లక్డీ కపూల్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, కొండాపూర్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ÷నాన్షియల్ డిస్ట్రిక్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఇక ఆఫీస్‌ల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం కురుస్తుండటంతో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. వర్షం కారణంగా ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.నగర వ్యాప్తంగా మరో గంట పాటు భారీ వర్షం కురుస్తుందని వాతావరణ వాఖ తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలకు జీహెచ్ఎంసీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఎవరు బయటికి రావద్దంటూ జీహెచ్ఎంసీ హెచ్చరించింది.

# బాలు, ఏఎన్ఆర్ స్మృతిలో ఘనంగా సాగిన సినీ స్వరాభిషేకం

**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** ప్రముఖ గాయకులు కీ.శే బాలసుబ్రహ్మణ్యం, అక్కినేని నాగేశ్వరరావు స్మృతిలో మిర్యాలగూడ కళా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మిర్యాలగూడలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్లో సినీ స్వరాభిషేకం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు ఏలే సత్యనారాయణ,శ్రీనివాస చారి,సత్యనారాయణ చారి, కందుకూరి సుదర్శన్, మురళీధర్, నవ్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంరంగారావు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెలలో అక్కినేని నాగేశ్వ్రరావు జయంతి, బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి పురస్కరించుకొని వారి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ అక్కినేని నటించిన సినిమాలలో ప్రముఖ గాయకులు కీ.శే బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలను గాయని గాయకులు ఆలపించారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి 40 మంది గాయని గాయకులు రామరంగరావు,దుర్గా సౌజన్య, సుజాత, నాగమణి, శైలజ, సరస్వతి,విజయ, పావని, వెంకటరెడ్డి, సుదర్శన్, దయమని, ప్రశాంత్, వినోద్ పాల్గొని ఆలాపించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి రాత్రి 7:30 నిమిషాల వరకు కార్యక్రమం కొనసాగింది. కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



# సీఎంపై నిరాధార ఆరోపణలు

## కేటీఆర్‌కు దమ్ముంటే, ఆరోపణలు రుజువు చేస్తే మేము దేనికైనా సిద్ధం

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమృత్ స్కీం టెండర్లలో రూ.8,888 వేల కోట్ల అవినీతి జరిగిందని కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించా రు. కేటీఆర్‌కు దమ్ముంటే, ఆరోపణలు రుజువు చేస్తే తాము దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారతుండడంతో అసహనానికి లోనై సీఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే.. 'ఖబడ్దార్ కేటీఆర్'అని కోమటిరెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు పార్టీ వదిలిపెట్టి పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో కేటీఆర్ మాట్లాడుతున్నాడన్నారు. కేటీఆర్ పదేళ్లు మున్సిపల్ శాఖ మంత్రిగా పని చేసి రూ.7 లక్షల కోట్లు అప్పులు చేశాడని అందులో రూ.2 లక్షల కోట్లు ఆయనకు టుంబమే దోచుకుందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ చచ్చిపోతోందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.



**దోపిడీ దొంగలకు అలాగే కనిపిస్తుంది**

హైదరాబాద్‌లో ఆదివారం సీఎల్పీ సమావేశం అనంతరం కూడా ఈ అంశంపై కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు లాంటి దోపిడీ దొంగలకు తమ ప్రభుత్వం కూడా అవినీతి చేసినట్లుగా కనిపిస్తుందేమోనని వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులలో కేటీఆర్ వేలకోట్ల రూపాయలు దోచుకున్నాడని ఆరోపించారు. సింగరేణి సంస్థలో కవిత ఏం చేసిందో త్వరలో బయటకు వస్తుందని అన్నారు. వారి దోపిడీ ప్రజలకు అర్థమైంది కనుకనే గత ఎన్నికల్లో ఓడించారని చెప్పారు.

# సొంతభూముల చుట్టూ ట్రిపుల్ ఆర్

## అక్రమాలకు తెరలేపిన సిఎం రేవంత్

## అలైన్ మెంట్ మార్పుతో భూదందాలకు తెర

## మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** రీజనల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం అలైన్ మెంట్ మార్పుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ దందాలకు తెరతీస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. రైతుల నుంచి అక్రమంగా భూములు లాక్కుంటూ అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దీనిపై సీబీఐ విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి పలు కీలక విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రీజినల్ రింగ్ రోడ్ దక్షిణభాగం అలైన్ మెంట్ మార్పుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూదందాలకు తెరలేపుతోంది. కేంద్ర నిధులతో చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కేసీఆర్ ఒప్పించారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం అలైన్ మెంట్ ఆమోదం పొందింది. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేదు. దక్షిణ భాగం అలైన్ మెంట్ కూడా గతంలోనే ఖరారు చేశారు. ఆమోదముద్ర పొందాల్సి ఉంది. స్వలాభం ఉందా లేదా అని కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలల్లో చూసుకొంది. స్వలాభం కోసం రీజినల్ రింగ్ రోడ్ అలైన్ మెంట్ మారుస్తూ పేదల భూముల్లో నుంచి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణ భాగం భూసేకరణ, రోడ్డు కోసం రాష్ట్రం రూ.2500 కోట్లు, కేంద్రం రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టాలి. కాంగ్రెస్ నేతల భూములు ఉన్న వైపు అలైన్ మెంట్ మారుస్తున్నారు. సాగర్ రోడ్ లో గొల్లపల్లి గ్రామం నుంచి కర్మపల్లి గ్రామానికి 2కి.మి, శ్రీశైలం రోడ్డులో కాటన్ మిల్ నుండి అమన్ గల్ దాటి దాదాపు నాలుగు కిలోమీటర్లు దూరానికి మార్చారని అన్నారు. ఫోర్త్ సిటీ సౌలభ్యం కోసం అలైన్ మెంట్ మారుస్తున్నామంటూ ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారని ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఫోర్త్ సిటీ, పాత అలైన్ మెంట్ మధ్య దూరం 10 కిలో మీటర్లు ఉంటే కొత్త అలైన్ మెంట్ మధ్య దూరం 12 కిలో మీటర్లు అయిందన్నారు. అలైన్ మెంట్ మార్పుతో ఫోర్త్ సిటీకి దూరమైందన్నారు. అమన్ గల్ వద్ద 400 ఎకరాల కుందారం భూములను పేదలు సాగు చేసుకుంటున్నారు. రాజ వంశీయులతో బేరం చేసుకొని పేదలను వెల్లగొట్టి కాంగ్రెస్ నేతలు భూములు ఆక్రమిస్తున్నారు.

# మన బంగారం



### చెస్ ఒలింపియాడ్‌లో చరిత్ర సృష్టించిన భారత పురుషుల, మహిళల జట్లు

### ప్రతిష్టాత్మక టోర్నీలో తొలిసారి పసిడి పతకాలు సొంతం

### భారత జట్ల విజయంలో కీలకపాత్ర పోషించిన హారిక, అర్జున్

### వ్యక్తిగత విభాగాల్లోనూ స్వర్ణాలు గెలిచిన అర్జున్, గుకేశ్, దివ్య, వంతిక

బుడాపెస్ట్: ప్రపంచ చదరంగ సామ్రాజ్యంలో తమకు తిరుగులేదని భారత క్రీడాకారులు నిరూపించారు. ఏ లక్ష్యంతోనైతే చెస్ ఒలింపియాడ్‌లో బరిలోకి దిగారో ఆ లక్ష్యాన్ని భారత క్రీడాకారులు దర్జాగా పూర్తి చేశారు. ఆద్యంతం అద్వితీయ ప్రదర్శనతో అదరగొట్టారు. అంచనాలకు మించి ఎత్తులు వేశారు. తమ ప్రత్యర్థులను చిత్తు చేశారు. వెరసి ఇన్నాళ్లూ సాధ్యంకాని ఘనతను సొంతం చేసుకున్నారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో ఏకకాలంలో భారత పురుషుల, భారత మహిళల జట్లు చాంపియన్‌గా నిలిచి తొలిసారి స్వర్ణ పతకాలను సొంతం చేసుకొని కొత్త చరిత్రను లిఖించాయి. ఆదివారం ముగిసిన ఈ మెగా టోర్నీలో గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్ (తెలంగాణ), దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద (తమిళనాడు), విదిత్ సంతోష్ గుజరాతి (మహారాష్ట్ర), పెంటేల హరికృష్ణ (ఆంధ్రప్రదేశ్)లతో కూడిన భారత పురుషుల జట్టు అజేయంగా నిలిచి 21 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అమెరికా జట్టుకు (17 పాయింట్లు) రజతం, ఉజ్బెకిస్తాన్ జట్టుకు (17 పాయింట్లు) కాంస్యం లభించాయి. ‘ గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక (ఆంధ్రప్రదేశ్), వైశాలి (తమిళనాడు), అంతర్జాతీయ మాస్టర్లు దివ్య దేశ్‌ముఖ్ (మహారాష్ట్ర), వంతిక అగర్వాల్, తానియా సచ్‌దేవ్ (ఢిల్లీ)లతో కూడిన భారత మహిళల జట్టు 19 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. కజకిస్తాన్ (18 పాయింట్లు) జట్టుకు రజతం, అమెరికా (17 పాయింట్లు) జట్టుకు కాంస్యం దక్కాయి.




- వ్యక్తిగత విభాగాల్లో గుకేశ్ (బోర్డు%-%1బీ 9 పాయింట్లు), అర్జున్ (బోర్డు%-%2బీ 10 పాయింట్లు), దివ్య దేశ్‌ముఖ్ (బోర్డు%-%3బీ 9.5 పాయింట్లు), వంతిక అగర్వాల్ (బోర్డు%-%4బీ 7.5 పాయింట్లు) అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకాలను సొంతం చేసుకున్నారు.
- చివరిదైన 11వ రౌండ్ మ్యాచ్‌ల్లో భారత పురుషుల జట్టు 3.5%-%0.5తో స్లొవేనియాపై గెలుపొందగా... భారత మహిళల జట్టు కూడా 3.5%-%0.5తో అజర్‌బైజాన్ జట్టును ఓడించింది.
- పురుషుల 11వ రౌండ్ గేముల్లో గుకేశ్ 48 ఎత్తుల్లో ఫెడోసీవ్‌పై, అర్జున్ 49 ఎత్తుల్లో జాన్ సుబెల్‌పై, ప్రజ్ఞానంద 53 ఎత్తుల్లో అంటోన్ డెమ్‌చెంకోపై నెగ్గగా... మాతెజ్ సబెనిక్‌తో జరిగిన గేమ్‌ను విదిత్ 59 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకున్నాడు.
- మహిళల 11వ రౌండ్ గేముల్లో ద్రోణవల్లి హారిక 51 ఎత్తుల్లో గునె మమాద్‌జాదాపై, దివ్య 39 ఎత్తుల్లో గొవర్ బెదులయేవాపై, వంతిక 53 ఎత్తుల్లో ఖానిమ్ బలజయేవాపై గెలుపొందగా... ఉలివియా ఫతలెవియాతో జరిగిన గేమ్‌ను వైశాలి 47 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకుంది.
- గతంలో భారత పురుషుల జట్టు ఈ టోర్నీలో రెండుసార్లు కాంస్య పతకాలు (2014, 2022) గెలుపొందగా... భారత మహిళల జట్టు ఒకసారి (2022) కాంస్య పతకాన్ని సాధించింది.



## బంగ్లాపై భారీ విజయం

### 280 పరుగుల తేడాతో టీమ్‌ఇండియా గెలుపు

### అశ్విన్ ఆల్‌రౌండ్ షో.. సిరీస్‌లో 1-0 ఆధిక్యం

చెన్నై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ భారీ విజయం సొంతం చేసుకుంది. చెన్నైలోని చెపాక్ వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 280 పరుగుల తేడాతో గెలిచి రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాట్‌తో సెంచరీ చేసిన రవిచంద్రన్ అశ్విన్.. రెండో ఇన్నింగ్స్‌లో బంతి (6/88)తో ఆరు వికెట్లు పడగొట్టి బంగ్లా పనిపట్టాడు. అశ్విన్‌కు తోడు అతడి సహచర స్పిన్నర్ రవీంద్ర జడేజా (3/58) రాణించడంతో 515 పరుగుల ఛేదనలో పర్యాటక జట్టు 234 పరుగులకే ఆలౌట్ అయి భారీ పరాభవాన్ని మూటగట్టుకుంది. భారీ ఛేదనలో ఆ జట్టు సారథి నజ్ముల్ హొసేన్ శాంతో (82) పోరాడినా అతడికి అండగా నిలిచేవారు కరువవడంతో బంగ్లాకు ఓటమి తప్పలేదు. మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షో తో అదరగొట్టిన రవిచంద్రన్ అశ్విన్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది. ఈ సిరీస్‌లో రెండో టెస్టు ఈనెల 27 నుంచి కాన్పూర్ వేదికగా జరుగనుంది.

**రెండు గంటల్లోపే..**

కొండంత లక్ష్యాన్ని కరిగించే క్రమంలో ఓవర్ నైట్ స్కోరు 158/4 వద్ద నాలుగో రోజు ఆటను ఆరంభించిన బంగ్లా కనీస పోరాటం లేకుండానే రెండు గంటల్లోపే తోకముడిచింది. తొలి గంటలో శాంతో, షకిబ్ (25) కొంతసపు వికెట్లను కాపాడుకునే దశలో మరీ నెమ్మదిగా ఆడారు. కానీ డ్రింక్స్ తర్వాత కెప్టెన్ రోహిత్.. బంతిని అశ్విన్‌కు అందించడంతో బంగ్లా ‘ఖేల్’ ఖతం అయింది. అశ్విన్, జడ్డూ కలిసి 10 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు. అశ్విన్ తన తొలి ఓవర్ (ఇన్నింగ్స్ 52వ)లోనే షకిబ్‌ను పెవిలియన్‌కు పంపాడు. స్లిప్స్‌లో యశస్వీ అద్భుత డైవ్ క్యాచ్ పట్టడంతో 48 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇక ఆ తర్వాత వచ్చినోళ్లెవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. జడ్డూ బౌలింగ్‌లో లిటన్ దాస్ (1) రోహిత్‌కు క్యాచ్ ఇవ్వగా బంగ్లా భారీ ఆశలు పెట్టుకున్న మెహిది హసన్ మిరాజ్ (8)ను అశ్విన్ ఔట్ చేసి రెండో ఇన్నింగ్స్‌లో ‘ఫైఫర్’ను పూర్తిచేసుకున్నాడు. జడేజా వేసిన 63వ ఓవర్లో హసన్ మహ్మూద్ (7) క్లీన్ బౌల్డ్ అవడంతో బంగ్లా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**రెండో టెస్టుకూ అదే జట్టు**

బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా జరిగే రెండో టెస్టుకు భారత జట్టులో మార్పులేమీ లేవు. తొలి టెస్టుకు ఎంపిక చేసిన జట్టు సభ్యులనే రెండో టెస్టులోనూ కొనసాగిస్తున్నట్టు ఆదివారం బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

## క్లీన్ స్వీప్ పరాభవం తప్పించుకున్న సౌతాఫ్రికా



షార్జా వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను సౌతాఫ్రికా 1-2 తేడాతో కోల్పోయింది. నిన్న (సెప్టెంబర్ 22) జరిగిన నామమాత్రపు మూడో వన్డేలో సౌతాఫ్రికా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తద్వారా ఆఫ్ఘన్ల చేతిలో క్లీన్ స్వీప్ పరాభవం నుంచి తప్పించుకుంది. రెండో వన్డేలో సెంచరీ హీరో ఈ మ్యాచ్‌లో కూడా రాణించినప్పటికీ.. ఆఫ్ఘనిస్తాన్‌కు పరాజయం తప్పలేదు. తొలుత బౌలర్లు.. ఆతర్వాత మార్క్రమ్ నిలకడగా ఆడి సౌతాఫ్రికాకు ఎట్టకేలకే ఓ విజయాన్ని అందించారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్.. 34 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. రహ్మానుల్లా గుర్బాజ్ మరో మంచి ఇన్నింగ్స్‌తో (89) ఆఫ్ఘనిస్తాన్‌కు చెప్పుకోదగ్గ స్కోర్ అందించాడు. గుర్బాజ్ మినహా ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌లో ఏ ఒక్కరూ రాణించలేదు. అల్లా ఘజన్‌ఫర్ (31), షాహిది (10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో ఎంగిడి, నకాబా పీటర్, ఫెహ్లుక్వాయో తలో మూడు వికెట్లు పడగొట్టగా.. ఫోర్టుయిన్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.



## అన్మోల్ ఖర్బ్‌కు రెండో టైటిల్

ఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ యువ సంచలనం అన్మోల్ ఖర్బ్ మరోసారి సత్తా చాటింది. కొద్దిరోజుల క్రిత మే ‘బెల్జియం ఇంటర్నేషనల్’ను గెలుచుకున్న 17 ఏండ్ల ఈ అమ్మాయి.. ఆదివారం లుబ్లిన్ (పోలండ్) వేదికగా ముగిసిన ‘పోలిష్ ఇంటర్నేషనల్ 2024’ మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్‌లో అన్మోల్.. 21-12, 21-8తో మిలెనా (స్విట్జర్లాండ్)ను ఓడించి వరుసగా రెండో టైటిల్ నెగ్గింది.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# వెంకటేశ్ మూవీ సెట్‌లో బాలయ్య సందడి

విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం చేస్తున్న సినిమా సెట్స్‌లో 'భగవంత్ కేసరి' బాలయ్య సందడి చేశారు. బాలయ్యతో 'భగవంత్ కేసరి' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రం తర్వాత దర్శకుడు అనిల్ రావిపూడి చేస్తున్న చిత్రం వెంకీఅనిల్3. అందుకే 'భగవంత్ కేసరి' సందడి చేశారని పేర్కొనడం జరిగింది. విక్టరీ వెంకటేష్ , బ్లాక్‌బస్టర్ మెషిన్ అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌ల సెన్సేషనల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న క్రేజీ ఎంటర్‌టైనర్ వెంకీఅనిల్3. ఇటీవల పొల్లాచ్చిలో లెన్తీ, క్రూసియల్ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని షెడ్యూల్ ప్రారంభించుకుంది. వెంకటేష్‌తో పాటు ప్రముఖ నటీనటులు ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు. ఊజాగా ఈ సెట్స్‌లోకి ప్రత్యేక అతిథి వచ్చి అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. లేటెస్ట్ షెడ్యూల్‌లో నటసింహం నందమూరి బాలకృష్ణ వెంకీఅనిల్3 సెట్స్‌లో సందడి చేశారు. ఈ ఆన్-లొకేషన్ స్టిల్స్‌లో బాలకృష్ణ, వెంకటేష్, అనిల్ రావిపూడి మధ్య సోదరభావం చూడటం డిలైట్ ఫుల్‌గా వుంది. బాలయ్య రాకతో టీం చాలా థ్రిల్ అయ్యింది. బాలకృష్ణ, వెంకటేష్ మంచి స్నేహితులనే విషయం తెలిసిందే. అనిల్ రావిపూడి ఆల్-టైమ్ హిట్ 'భగవంత్ కేసరి'ని రూపొందించారు. ఈ మూవీ ఇటీవల ఉత్తమ చిత్రం అవార్డును గెలుచుకుంది. ప్రస్తుతం వెంకీమామ సెట్స్‌లో బాలయ్య ఉన్న పిక్స్ వైరల్ అవుతున్నాయి.వెంకీఅనిల్3 చిత్రంలో వెంకటేష్ భార్యగా ఐశ్వర్య రాజేష్ నటిస్తుండగా, మీనాక్షి చౌదరి ఎక్స్ లవర్‌గా కనిపించనుంది. ఈ ట్రై యాంగిల్ క్రైమ్ డ్రామాని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. టాప్ టెక్నిషియన్స్ ఈ సినిమా కోసం పని చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా.. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనింగ్, తమ్మిరాజు ఎడిటింగ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ కో -రైటర్స్. వి వెంకట్ యాక్షన్ డైరెక్టర్. ఈ సినిమాని 2025 సంక్రాంతి సందర్భంగా విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.



# నా అనుమతి లేకుండా ముఖ్యమైన సీన్స్ కాపీ చేశారు, బాధేసింది!

తాను హక్కులు పొందిన ప్రముఖ నవలలోని సన్నివేశాలను అనుమతి లేకుండా వాడేశారని దర్శకుడు శంకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. కాపీ రైట్స్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించాడు. ఈ మేరకు ఎక్స్(ట్విటర్)లో ఓ పోస్ట్ పెట్టాడు. 'ముఖ్య గమనిక! వెంకటేశన్ రాసిన తమిళ నవల వీర యుగ నాయగన్ వేళ్ కాపీరైట్స్ నావే.. నా అనుమతి లేకుండా చాలా సినిమాల్లో ఈ నవలలోని కీలక సన్నివేశాలను ఇష్టానుసారం వాడేస్తున్నారు. ఇప్పుడు లేటెస్ట్ సినిమా ట్రైలర్‌లోనూ ఓ ముఖ్యమైన సీన్ వాడేశారు. అది చూసి చాలా బాధేసింది. నా నవలలోని సన్నివేశాలను సినిమాలు, వెబ్ సిరీస్.. ఇలా ఏ ఇతర ప్లాట్‌ఫామ్‌లోనైనా వినియోగించడం మానుకోండి. క్రియేటర్ల హక్కులను గౌరవించండి. కాపీ రైట్స్ ఉల్లంఘించకండి. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది' అని రాసుకొచ్చాడు. ఇది చూసిన నెటిజన్లు ఇంతకీ నవలను కాపీ కొట్టిన సినిమా ట్రైలర్ ఏదో చెప్పి ఉండాల్సింది అని కామెంట్లు చేస్తున్నారు. కాగా శంకర్.. సూపర్ హిట్ మూవీ భారతీయుడుకు సీక్వెల్‌గా తెరకెక్కించిన భారతీయుడు 2తో ఫ్లాప్ మూటగట్టుకున్నాడు. ప్రస్తుతం గేమ్ ఛేంజర్ సినిమాతో బిజీగా ఉన్నాడు.

# థగ్‌లైఫ్ షూటింగ్ పూర్తి..

## భారీ ధరకు డిజిటల్ రైట్స్



కోలీవుడ్ స్టార్ హీరో కమల్ హాసన్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం థగ్‌లైఫ్. మణిరత్నం దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నటుడు శింబు, నటి త్రిష, జోజూ జార్జ్, ఐశ్వర్య లక్ష్మి, గౌతమ్ కార్తీక్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఏఆర్ రెహ్మాన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రాన్ని కమలహాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్, మణిరత్నంకు చెందిన మద్రాస్ టాకీస్, రెడ్‌జెయింట్ మూవీస్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. 36 ఏళ్ల క్రితం మణిరత్నం, కమలహాసన్ కాంబోలో రూపొందిన చిత్రం నాయకన్ (నాయకుడు). ఆ తరువాత ఇన్నాళ్లకు వీరి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం థగ్ లైఫ్. దీంతో ఈ చిత్రంపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. కాగా ఇది నటుడు కమలహాసన్ నటిస్తున్న 233వ చిత్రం కావడం గమనార్హం. అదే విధంగా ఆయన ఇందులో 3 పాత్రల్లో నటిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్ర షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు యూనిట్ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో దానికి సంబందించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. థగ్‌లైఫ్ చిత్రం వ్యాపారం మొదలైందని సమాచారం. ఈ చిత్ర డిజిటల్ హోక్కులను రూ.150 కోట్లకు విక్రయించినట్లు తాజాగా సమాచారం. ఇంత పెద్దమొత్తంలో డిజిటల్ వ్యాపారం ఇంతకు ముందు ఏ చిత్రానికి జరగలేదనే ప్రచారం సాగుతోంది. కాగా థగ్‌లైఫ్ చిత్రాన్ని వచ్చే ఏడాది మేలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను చిత్ర వర్గాలు త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది.

# 'కుర్చీ మడతపెట్టి' సాంగ్‌కు డ్యాన్స్ చేసిన మృణాల్ ఠాకూర్..



టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్‌బాబు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం గుంటూరు కారం ఈ సినిమాలోని 'కుర్చీ మడతపెట్టి' పాట ఎంత ఫేమస్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహేశ్‌బాబు, శ్రీలీల ఊరమాస్ స్టెప్పులతో థియేటర్లలో మోత మొగించింది ఈ పాట. ఇప్పటికే ఈ పాటకు కోలీవుడ్‌తో పాటు మాలీవుడ్ సెలబ్రిటీలు స్టెప్పులు వేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పాటకు టాలీవుడ్ భామ సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ డ్యాన్స్ చేసింది. రీసెంట్‌గా ఓ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మృణాల్ ఠాకూర్ 'కుర్చీ మడతపెట్టి' సాంగ్‌కు స్టెప్పులేసింది. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల విషయానికి వస్తే.. ప్రభాస్ కల్కి సినిమాలో గెస్ట్ రోల్‌లో కనిపించిన ఈ భామ ప్రస్తుతం వరుసగా బాలీవుడ్ సినిమాలు చేస్తుంది. పూజా మేరీ జాన్, హై జవానీ తో ఇష్క్ హెూనా హై, సన్ ఆఫ్ సర్దార్ 2 సినిమాలతో పాటు తుమ్ హి హెూ సినిమాలతో ఈ భామ బిజీగా గడుపుతుంది.


# 'కుర్చీ మడతపెట్టి' సాంగ్‌కు డ్యాన్స్ చేసిన మృణాల్ ఠాకూర్..




టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్‌బాబు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ( కాంబోలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం గుంటూరు కారం ఈ సినిమాలోని 'కుర్చీ మడతపెట్టి' పాట ఎంత ఫేమస్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మహేశ్‌బాబు, శ్రీలీల ఊరమాస్ స్టెప్పులతో థియేటర్లలో మోత మొగించింది ఈ పాట. ఇప్పటికే ఈ పాటకు కోలీవుడ్‌తో పాటు మాలీవుడ్ సెలబ్రిటీలు స్టెప్పులు వేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ పాటకు టాలీవుడ్ భామ సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ డ్యాన్స్ చేసింది.

# తెలుగులోకి వచ్చేసిన బాలీవుడ్ సూపర్ హిట్ మూవీ 'ముంజ్యా'

బాలీవుడ్ నటి శార్వారీ వాఘ్, అజయ్ వర్మ ప్రధాన పాత్రలలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'ముంజ్యా'. ఆదిత్య చోప్రా యష్ రాజ్ ఫిల్మ్స్ యూనివర్స్ రూపొందించిన స్పై యూనివర్స్‌లో భాగంగా వచ్చిన ఈ చిత్రం హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చి రూ.100 కోట్ల కలెక్షన్లు సాధించడమే కాకుండా మంచి సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. ఇక ఈ సినిమాకు ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహించాడు. అయితే ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. ప్రముఖ ఓటీటీ వేదిక డిస్నీ ప్లస్ హాట్ స్టార్ లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. అయితే ఈ సినిమా ఒక హిందీలోనే ఉండడంతో హారర్ సినిమాలను ఇష్టపడే అభిమానులు నిరాశకు గురయ్యారు. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాను తెలుగు వెర్షన్‌లో కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. బిట్టు (అభయ్ వర్మ) తనకు నచ్చినట్లు బ్రతుకుదాం అనుకుంటాడు. అయితే బిట్టు తల్లి పమ్మి (మోనా సింగ్)కి అతిజాగ్రత్త ఎక్కువ. అందుకే బిట్టును తనకు నచ్చినట్టుగా బ్రతకనివ్వదు. కానీ బిట్టు మాత్రం స్వేచ్ఛగా ఉండాలని కలలు కంటుంటాడు. ఇదిలావుంటే తన అమ్మమ్మ ఉండే కొంకణ్ ప్రాంతంలోని ఒక ఊరికి బిట్టు, పమ్మి కలిసి వెళ్తారు. అయితే ఆ ఊరిలో ముంజ్య అనే ఒక పిల్ల దయ్యం ఎంతోకాలంగా తన కోరికను తీర్చుకోవడానికి ఎదురుచూస్తుంటుంది. అయితే బిట్టు అనుకోకుండా ఆ పిల్ల దయ్యం దగ్గరికి వెళ్లగా అతడిని వశపరచుకుంటుంది ముంజ్య. తనకు మాత్రమే కనిపిస్తూ తనను టార్చర్ చేస్తుంటుంది. అయితే అసలు ముంజ్య ఎవరు. బిట్టు వెనక మాత్రమే ఎందుకు పడుతుంది. అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.





Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.